క్లుప్తంగా...

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేయనున్నట్లు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్‌లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని రాజేంద్రనగర్ పత్తికుంట, బుద్వేల్, శివరాంపల్లి ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్ పర్సన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి

మణికొండ: వేసవికాలం నేపథ్యంలో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డిలు వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఎంజీ పార్క్, 9వ వార్డు నేతాజీ పార్క్‌లో 350 లీటర్ల కెపాసిటి కలిగిన తాగునీటి మెషిన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, వసంతరావు, కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఏఈఈ సాయిమౌనిక, కాలనీవాసులు పాల్గొన్నారు.

మత్స్యశాఖలో పదవి ఇవ్వాలని వినతి

జియాగూడ: మత్స్యశాఖలో చేపలుపట్టే కులవృత్తిదారులకే పదవి కేటాయించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మత్స్యశాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కావూరి వెంకటేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకాలం నాటి నుండి పనిచేస్తున్న తనకు మత్స్యశాఖలో వైస్ చైర్మన్ పదవిని కేటాయించాలని కోరారు. అలాగే ఇటీవల మత్స్యశాఖ చైర్మన్‌గా ముదిరాజ్ కులానికి చెందిన పిట్టల రవీందర్‌ను నియమించడంతో పాటు పార్టీలో గత సంవత్సరమే చేరిన దొడ్డి మల్లయ్యకు వైస్ చైర్మన్ పదవి కేటాయిస్తుండడం సరికాదన్నారు. ఇప్పటికే దొడ్డిమల్లయ్య ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అయి పెన్షన్ కూడా పొందుతున్నారన్నారు. చేపలు పట్టే కులానికి చెందిన తనకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నర్మద, జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి సి.బాబు, మధు, కృష్ణకుమారి, సంతోషిబాయి, అరుణ పాల్గొన్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి

అబిడ్స్: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి మంత్రి సహకారంతో పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గం పరిధిలోని మొరంబస్తీలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.... మొరంబస్తీలో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇతర దీర్ఘకాలిక సమస్యలను మంత్రి తలసాని సహకారంతో పలు శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన మొరం బస్తీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు కె.దేవేందర్, ప్రధాన కార్యదర్శి వేణుకుమార్, ఇతర నాయకులు హేమంత్‌కుమార్, అర్జున్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలివచ్చిన పీఠాధిపతులు, వేద పండితులు

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవానికి బుధవారం పలువురు పీఠాధిపతులు, వేద పండితులు హాజరయ్యారు. వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామి, తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, వేద పండితులు, అర్చకులు, బ్రాహ్మణులు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు తరలివచ్చారు.

2017లో శంకుస్థాపన... ఇప్పుడు ప్రారంభోత్సవం

- గోపన్‌పల్లిలో విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మాణానికి 6.25 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.
- ఈ స్థలంలో రూ.12 కోట్ల వ్యయంతో 'విప్రహిత బ్రాహ్మణ సదన్'ను నిర్మించారు.
- 2017 జూన్ 5న మంత్రి కేటీరామారావు శంకుస్థాపన చేయగా, బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు.

చండీయాగం.. పూర్ణాహుతి..

- విప్రహిత బ్రాహ్మణ సదన్ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలలు ఏర్పాటు చేసి చండీ యాగం వైభవంగా నిర్వహించారు.
- అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.





సౌకర్యాలు.. భవిష్యత్ ప్రతిపాదనలు..

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్మించిన బ్రాహ్మణ సదన్‌లో 4 భవనాలు నిర్మించారు.
- పరిపాలనా భవనం, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కల్యాణ మండపం, ఆడిటోరియం, గెస్ట్ రూమ్స్, టాయిలెట్స్ బ్లాక్స్ నిర్మించారు.
- సమాచార కేంద్రం, పీఠాధిపతులు, ధర్మాచార్యుల సదనం, భక్తి, ఆధ్యాత్మిక భావజాల వ్యాప్తికి సంబంధించి సమస్త సమాచార కేంద్రం, రిసోర్స్ సెంటర్‌గా ఈ సదన్ సేవలందిస్తుంది.
- ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, సాహిత్యంతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- ఈ సదన్‌లో బ్రాహ్మణుల వివాహాలు, ఉపనయనం చేసుకోవచ్చు.
- భవిష్యత్‌లో ఉన్నత చదువులకు విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించడం, పోటీ పరీక్షలకు కోచింగ్ క్లాసుల నిర్వహణతో బాటు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ కూడా అందుబాటులోకి తేవాలనే ప్రతిపాదనలున్నాయి.



కంటివెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: కంటి వెలుగు కేంద్రాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని శివాజీనగర్ కాలనీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌లో కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ నరేందర్ హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రాలలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు కంటి అద్దాలను అందిస్తారన్నారు.ఈ కేంద్రం మే 31వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు లావణ్యనరేష్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, వసంతరావు, కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, సిద్ధప్ప, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కంటివెలుగు కేంద్రంలో పరీక్ష చేయించుకుంటున్న నాయకులు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



మండల విద్యాధికారి డి.రామిరెడ్డి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి కోరారు. జూన్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బడిబాటను వివిధ రూపాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకుగాను రాజేంద్రనగర్ పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పాఠశాలల విద్యా కమిటి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం అవుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటారన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం ,బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలను ప్రచారం చేయాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో 7 గంటల నుంచి 11 గంటల వరకు నూతనంగా పాఠశాలల్లో చేరే విద్యార్థులను గుర్తించడంతో పాటు బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం పట్ల స్థానికంగా ఉన్న ఎస్ఎస్‌జీ, లోకల్ బాడీ కమిటీల సహకారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు.

నిరుపయోగంగా జీహెచ్ఎంసీ టాయిలెట్స్



అత్తాపూర్: జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు నగరంలో ఏర్పాటు చేసిన టాయిలెట్స్, దుకాణాల సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభానికి నోచుకోకుండానే ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ శిథిలమయ్యాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ టాయిలెట్స్‌ను ప్రజలు వినియోగించుకోకపోవడంతో ఆ ప్రాంతంలో చెత్తచెదారాలను పడేస్తున్నారు. దీంతో ఆ మార్గం గూండా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ జనప్రియ ప్రధాన రహదారి నుంచి ఈశ్వర్ థియేటర్‌కు వెళ్లేమార్గంలో ఏర్పాటు చేసిన ఈ టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొగాకు వినియోగంలో భారత్ రెండవ స్థానంలో ఉంది

టిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్

రాయదుర్గం: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రపంచంలో ప్రతియేటా 8 మిలియన్ల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ప్రంచవ్యాప్తంగా పొగాకు వినియోగంలో భారత్ రెండవ స్థానంలో ఉందన్నారు.గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్టిక్కర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 'మనకు ఆహారం కావాలి- పొగాకు కాదు' అనే నినాదంతో నిర్వహించడం జరుగుతోందన్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించడంతో ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్, గుండెపోటు, రక్తపోటు, మధుమేహం, కంటి చూపు మందగించడం లాంటి 21 వ్యాధులు సంభవిస్తాయన్నారు.యువత చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మా రబోయిన సదానంద్‌యాదవ్, జనార్దన్, కె బాలన్న, వాణి సాంబశివరావు, మల్లేష్ పాల్గొన్నారు.



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్, రామస్వామి యాదవ్

డైలీ పాస్ ఈ సర్వీస్‌లో నడవదా?

రాజేంద్రనగర్: ఆర్టీసీ అధికారులు జంట నగరాలలో 24 గంటల పాటు ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన 90 రూపాయల బస్‌పాస్ తమకు ఉపయోగపడడం లేదని రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట మండలాల ప్రజలు వాపోతున్నారు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి ఆర్టీసీ ప్రతి రోజు 315 నంబరు గల సర్వీసు బస్సును నడుపుతుంది. ఈ బస్సు శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. వ్యాపారస్తులు, ఉద్యోగులు, స్థానిక ప్రాంతాల ప్రజలు గచ్చిబౌలి, శంషాబాద్‌కు వెళ్లేందుకు ఈ సర్వీసు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ 90 రూపాయల టికెట్ కొనుగోలు చేస్తే 24 గంటల పాటు జంట నగరాలలోని అన్ని బస్సుల్లో ప్రయాణించేలా రూపొందించింది. కానీ ఈ సర్వీసుకు ఈ పాసు నడవదని కండక్టర్లు తెలుపుతుండడంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు నూతన క్రీడా పాలసీ

సీఎం కప్ ముగింపు సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గచ్చిబౌలి: అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా నూతన క్రీడా పాలసీని రూపొందిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో సీఎం కప్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడల కోసం సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా నూతన క్రీడా పాలసీ రూపొందిస్తున్నారని తెలిపారు. ఓటమిని విజయంగా మార్చుకునే శక్తి క్రీడాకారులకే ఉంటుందన్నారు. అనంతరం హాకీ విన్నర్‌గా నిలిచిన సంగారెడ్డి, రన్నర్ నిజామాబాద్, ఫుట్‌బాల్ విజేత ఖమ్మం, రన్నర్ నల్గొండ బాలురు, బాలికల జట్లకు మంత్రి బహుమతులు అందజేశారు.



విజేత జట్లకు జ్ఞాపికను అందిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఉద్యోగ విరమణ సభ



సుధీర్‌కు మొమెంటో ఇస్తున్న రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధీర్ కుమార్, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ రత్నకుమారి ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు బుధవారం విశ్వవిద్యాలయంలో వీరిని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇంచార్జీ ఉపకులపతి ఎం రఘునందన్‌రావు, వెంకటరమణ, సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

గోల్కొండ కోటలో చిత్రలేఖనం పోటీలు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిర్వహిస్తుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ అమర్ సింగ్ అన్నారు. బుధవారం కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో ఖిలా ఔర్ కహానియా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు వివిధ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహంచారు. ఈ సందర్భంగా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు చిత్రలేఖనానికి అవసరమైన అన్ని రకాల వస్తువులు అందించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కేంద్రప్రభుత్వం గోల్కొండ కోటను ఎంచుకుందని, ఇందులో భాగంగా 3 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 2వ తేదీన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఉదయం 7 గంటలకు కోటలో జరిగే పతాకావిష్కరణలో పాల్గొంటారని ఆయన తెలిపారు.సునీల్ యాదవ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధి

గోల్కొండ: బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలోని ఆలయాలు కొత్త రూపు సంతరించుకున్నాయని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. జీవన్ సింగ్ అన్నారు. బుధవారం నానల్ నగర్ తిరుపల్లిగడ్డ శ్రీ కోమౌ రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే సెక్యులర్ ముఖ్యమంత్రి అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గోల్కొండ: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సాంకేతిక విద్య బాటలు వేస్తుందని ప్రముఖ కూచిపూడి డ్యాన్సర్ పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం పద్మజారెడ్డి అన్నారు. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల 2019–23 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినుల క్రీడోత్సవాలు బుధవారం కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె విజేతలకు బహుమతులు అందించారు. ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థినీలు జాతీయ, విశ్వవిద్యాలయ పోటీలలో ఎన్నో అవార్డులు తెచ్చారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ జి. శ్రీవిద్యారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పురానాపూల్ చౌరస్తా ట్రాఫిక్‌మయం

- తరచూ సమస్య
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



జియాగూడ: పురానాపూల్ చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యతో నెలకొంటోంది. పలు ప్రాంతాలు, ప్రధాన మార్కెట్లకు వెళ్లే చౌరస్తా కావడంతో తరచు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడే కొన్ని రోజులుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. నత్తనడకగా జరుగుతుండడంతో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోతోంది. పురానాపూల్ చౌరస్తా నుండి అఫ్జల్‌గంజ్, కార్వాన్, జియాగూడ మేకలమండి, సబ్జిమండి 100 ఫీట్ల రోడ్డు చార్మినార్‌కు వెళ్లే ప్రధాన కూడలి చౌరస్తా ట్రాఫిక్ సమస్య తీరేందుకు గతంలో చర్యలు తీసుకున్నప్పటికీ పరిష్కారం అంతంత మాత్రమే. చౌరస్తాలోని నిత్యావసర, కూరగాయలు, పండ్ల తోపుడుబండ్లు నెలకొని ఉండడం, ఆటోవాలాలు గంటల తరబడి చౌరస్తా వద్దే ఉండడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే పురానాపూల్ చౌరస్తా సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

పాత వంతెనపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

పురానాపూల్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికి పురానాపూల్ వంతెనపై కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. గతంలో పురానాపూల్ చౌరస్తా నుండి చార్మినార్ వెళ్లేందుకు ఉన్న ఈ వంతెన సరిపోకపోవడంతో 1995లో అదనపు వంతెన చేపట్టి ప్రారంభించారు. అయినా పాత వంతెనపై కూరగాయల మార్కెట్ కొనసాగుతుండడం వల్ల అదనపు రద్దీకి వంతెన సరిపోవడం లేదు. పురానాపూల్ పాతవంతెనపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను తరలించి రెండు వంతెనపై వన్ వే పద్ధతిని అమలు చేయాలని ప్రయాణికులు తెలియజేస్తున్నారు.

నత్తనడకన చౌరస్తా అభివృద్ధి పనులు

పురానాపూల్ చౌరస్తా రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. చౌరస్తా నలుదిక్కులా అక్రమ షెడ్లనులను తొలగించడం తిరిగి చిరు వ్యాపారులు వేసుకోవడం పరిపాటిగా మారింది. చౌరస్తాలో రోడ్డు వెడెల్పు పనులు నత్త నడకగా కొనసాగుతున్నాయి. త్వరలో చౌరస్తా అభివృద్ధి పనులు పూర్తిచేసి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఆర్.మాలతీ నాగరాజు

బండ్లగూడ: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ఆర్.మాలతీనాగరాజు వెల్లడించారు. గంధంగూడలోని వెస్టెండ్ కాలనీలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు, సుధాకర్, కాలనీవాసులు ఉన్నారు.